

88 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం బొద్దమ్మ పీఠంలో సోమవారం వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 88 మందికి నేత్ర పరీక్షలు చేశారని వైద్యులు తెలిపారు. వీరిలో 14 మందికి శస్త్ర చికిత్సలు అవసరంకాగా, 30 మందికి కళ్లజోళ్లు పద్యాయించారు. మిగిలినవారికి మందులు పంపిణీ చేసినట్లు సీనియర్ కంటి వైద్య నిపుణులు ఎస్.కె.కరీం తెలిపారు. పరీక్షలకు వచ్చిన రోగులకు సీతాఫలపతి భోజనం అందించారు. రోగులకు అవసరమైన మందులు, శస్త్ర చికిత్సలు పూర్తిగా ఉచితంగా చేస్తారని, కళ్లజోళ్లు, ఫ్రేములు అవసరమైన వారికి నామమాత్రపు రుసుంతో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి నెలా మూడవ సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరంతో పాటు, దంత వైద్య పరీక్షలు సైతం నిర్వహిస్తారని తెలిపారు.

గోపాలపురంలో పారిశుధ్య లోపం

- చెత్తతో నిండిపోయిన వీధులు
- రోడ్లపైకి చేరుతున్న మురుగునీరు
- ఈగలు, దోమలతో ఇబ్బందులు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మండలంలో పారిశుధ్యం క్షీణించింది. మండలంలోని గ్రామాల్లో ఎక్కడ చూసినా వీధులు చెత్తాచెదారంతో, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయి డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్నాయి. కాలువలు పూడిక తీతకు నోచుకోకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. రోజుల తరబడి నిల్వ ఉండిపోవడంతో దోమలు, ఈగలకు అవి ఆవాసాలుగా మారుతున్నాయి.

స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాల వద్ద మురుగునీరు, చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. చుట్టుపక్కల వారు చెత్తను ఇక్కడే డంప్ చేసేస్తున్నారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ కూడా సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. కోమటికుంట నుంచి గోపాలపురం – గోడపేట డ్రెయినేజీ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఈ డ్రెయినేజీలో చెత్త పేరుకుపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతోంది. దీంతో దోమలు తీవ్రంగా విజృంభిస్తున్నాయని, ఫలితంగా రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. స్థానిక సుబ్రహ్మణ్యం గుడికి వెనక వీధిలో పంచాయతీ కుళాయిలు డ్రెయినేజీ మధ్యలో ఉన్నాయి. దీంతో తాగునీటిని పట్టుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. వాటిని తాగాలన్నా భయమేస్తుందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రజకుల పేటలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్న పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు.



పశువైద్యశాల వద్ద పేరుకుపోయిన చెత్త

సిబ్బంది కొరత

పంచాయతీని పారిశుధ్య కార్మికుల కొరత వేధిస్తోంది. తగినంత మంది కార్మికులు, సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారిపై అదనపు భారం పడుతుంది. గోపాలపురం పంచాయతీకి 20కు పైగా కార్మికులు అవసరం ఉండగా 13 మంది మాత్రమే ఉన్నారు. గ్రామంలో పారిశుధ్య పనులకు అదనంగా గ్రామంలో శుభకార్యాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సమావేశాలు, ప్రజా ప్రతినిధుల పర్యటనల సమయంలో అదనపు పనిని సైతం వీరే చేయాల్సి వస్తుంది. ఫలితంగా సమయానికి చెత్త సేకరణ చేసేందుకు కుదరడం లేదు. చెత్తను తొలగింపునకు సుమారు 20 నుంచి 30 రోజులు పడుతుండడంతో పారిశుధ్యం లోపిస్తోంది.

డ్రెయినేజీలో కొళాయి

పదో వార్డు రజకుల పేటలో పంచాయతీ కొళాయి కనెక్షన్ డ్రెయినేజీ మధ్యలో ఉంది. ఆ కొళాయి నీటిని పట్టుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. కుళాయి కింద జాయింట్ వద్ద లీకు ఉండటంతో తాగునీరు కలుషితమవుతుంది. ఆ నీటినే వాడటంతో రోగాల బారిన పడుతున్నాం. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు.

- చిట్టిబోయిన వెంకట్రావు, రజకులపేట, గోపాలపురం



అధికారులు పట్టించుకోవడం లేదు..

గోపాలపురం గ్రామంలో డ్రెయినేజీలు సరిగా లేవు. దీంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. వీధుల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తుంది. ఎస్‌సి కాలనీలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. ప్రజాప్రతినిధులు పర్యటనప్పుడు మాత్రమే ముందుగా చెత్తను తొలగించి హడావుడి చేస్తున్నారు.

- సిహెచ్.సునీల్, గోపాలపురం.



చెత్తతో పూడుకుపోయిన డ్రెయినేజీ



ధర్నాలో పాల్గొన్న సహకార సంఘం ఉద్యోగులు

సహకార సంఘాల ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సమస్యలను పరిష్కరించాలని, డిమాండ్లను నెరవేర్చాలని రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాథమిక సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరామయ్య మాట్లాడారు. జిఒ 36 ప్రకారం పేస్కేల్ అమలు చేయాలన్నారు. చట్ట ప్రకారం గ్రాట్యూటీని అమలు చేయాలన్నారు. ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. 2019 తరువాత చేరిన ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సహకారం సంఘాలను ప్రయివేటుపరం చేయకుండా చట్ట సవరణ చేయాలని కోరారు. సహకార వ్యవస్థలో మూడంచెల విధానంలోనే రుణాలు మంజూరు చేయాలన్నారు. డిసిసిబితో డైరెక్ట్ లోనింగ్ విధానాన్ని నిలిపేయాలన్నారు. డిసిసిబిలు, పిఎసిఎస్‌ల షేరు ధనంపై ఆరు శాతం కనీసం డివిడెండ్ లేదా వడ్డీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రామచంద్రం, కోశాధికారి జి.సుధాకర్ వర్మ, కన్వీనర్ కె.ప్రసాద్, సిఐటియు నాయకులు ఎస్-ఎస్.మూర్తి, పవన్, సహకార ఉద్యోగులు పాల్గొన్నారు.


పెట్రోల్‌బంక్‌ను ప్రారంభించిన డిజిపి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను, అలాగే నూతన పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను డిజిపి ద్వారక తిరుమలరావు సోమవారం ప్రారంభించారు. తొలుత ఆయనకు ఏలేరు రేంజి ఐజి జివిజి.అశోక్‌కుమార్, ఎస్‌పి డి.నరసింహకిశోర్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన కాకినాడకు పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పిలు ఎన్‌బిఎం.మురళీకృష్ణ, అల్లూరి వెంకట సుబ్బరాజు, ఎల్.అర్జున్, ఎల్.చెంచిరెడ్డి, డిఎస్‌పిలు పాల్గొన్నారు.



పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న డిజిపి ద్వారక తిరుమలరావు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాజానగరం

అధికారులు క్షేత్ర స్థాయిలో గ్రామాల్లో పర్యటించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజానగరం ఎంపిడిఒ కార్యాలయంలో పిజిఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 54 అర్జీలను స్వీకరించారు. రెవెన్యూకు సంబందించి 30, పంచాయతీ రాజ్‌కు సంబంధించి 11, పోలీస్ శాఖకు సంబంధించి 2, ఇతర శాఖలకు సంబంధించి 11 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, విఆర్ఒ, సచివాలయం సిబ్బంది బాధ్యతా యుతంగా పనిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటన చేయని అధికారులపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. అధికారులు తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్జీలను నిబంధనలకు అనుగుణంగా సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జివిఎల్.దేవి, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కేంద్రంగా 'రాజానగరం' పాలన

సమీక్షలు, సమావేశాలు అన్నీ అక్కడే..
ఎంఎల్‌ఎ బాటలోనే అధికారులు

ప్రజాశక్తి - కోరుకొండ

రాజానగరం నియోజకవర్గం పరిపాలన మొత్తం రాజమహేంద్రవరం కేంద్రంగా సాగుతోంది. గత ప్రభుత్వంలో వివిధ ప్రభుత్వ శాఖల సమీక్షా సమావేశాలు రాజమహేంద్రవరంలోని అప్పటి రాజానగరం ఎంఎల్‌ఎ ఇంటి వద్ద జరిగినవి. ప్రస్తుత రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ సైతం అదే బాటలో పయనిస్తున్నారు. రాజమహేంద్రవరంలోని ఆయన ఇంటి నుంచే పాలన సాగిస్తున్నారు. గత ఎంఎల్‌ఎ స్థానికేతరుడు అంటూ ప్రచారం చేసి ప్రస్తుతం జనసేన ఎంఎల్‌ఎ బలరామకృష్ణ ఎన్నికల్లో లబ్ధిపొందారు. ప్రస్తుతం ఆయన కూడా రాజమహేంద్రవరంలో స్థిరనివాసం ఏర్పరచుకుని అక్కడి నుంచే పాలన సాగించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాలకు చెందిన మండల, గ్రామ స్థాయిలో పనిచేసే అధికారులందరూ నూటికి 90 శాతం మంది రాజమహేంద్రవరంలోనే నివాసం ఉంటున్నారు. కొంత మంది అధికారులు పనివేళల సమయానికి నియోజకవర్గానికి రావడం, మధ్యాహ్నం తిరిగి రాజమహేంద్రవరం వెళ్లిపోవడం, మరికొంత మంది రాజమహేంద్రవరంలోనే ఉంటూ అక్కడ నుంచే ఫోన్ ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

మరికొంత మంది అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండకుండా ఎంఎల్‌ఎతో సమీక్షా సమావేశం, కలెక్టర్‌తో సమీక్షా సమావేశం, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశానికి వెళ్లామంటూ చెబుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసు, వ్యవసాయ, గృహ నిర్మాణ, రెవెన్యూ, పంచాయితీ రాజ్, వైద్యశాఖ, నీటి పారుదల, ఐసిడిఎస్ తదితర శాఖలకు చెందిన మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులతో పాటు సచివాలయ ఉద్యోగులు సైతం రాజమహేంద్రవరం నుంచే వస్తున్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ, పోలీసు ఉన్నతాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు సైతం రాజమహేంద్రవరంలో నివాసం ఉంటూ నియోజకవర్గానికి చుట్టపు చూపుగా వచ్చి వెళ్లిపోతున్నారనే విమర్శలున్నాయి. ఇలాగైతే తమ సమస్యలను ఎవరు ఎలా పరిష్కరిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వీరందరికి స్థానికంగా నివాసం ఉండటానికి ప్రభుత్వం హెచ్‌ఆర్‌ఎ విడుదల చేస్తుంది. అయినా అధికారులు స్థానకంగా ఉండట్లేదనే చర్చ నడుస్తోంది. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన కరోనా సమయంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్థానికంగా లేకపోవడం వల్ల నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్థానికంగా నివాసం ఉంటే నియోజకవర్గ అభివృద్ధికి, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వీలవుతుందని నియోజకవర్గ ప్రజలు కోరుకుంటున్నారు.


అందుబాటులో 5.51 లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలో 9 ఇసుక రీచ్‌ల్లో 5.51 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్గదర్శకాల ప్రకారం బోట్స్ మ్యాన్ సొసైటీ సభ్యులకు ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు, లోడింగ్‌కు అనుమతులిచ్చామన్నారు. సెమీ మెకనైజ్డ్ ఒపెన్ సాండ్ రీచ్‌లకు పబ్లిక్ హియరింగ్‌లు నిర్వహించాల్సి ఉందన్నారు. నిడదవోలు మండలం పురుషోత్తం పల్లి రీచ్‌కి ఫిబ్రవరి 10న, కొవ్వూరు ఆరికిరేవుల రీచ్‌కు 11న, తాళ్లపూడి మండలం తాడిపూడి, ప్రక్కిలంక రీచ్‌లకు 12న, నిడదవోలు మండలం పెండ్యాల, కొవ్వూరు మండలం చిడిపి, సీతానగరం మండలం సింగవరం ఇసుక రీచ్‌లకు ఫిబ్రవరి 13న పబ్లిక్ హియరింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా ఆర్‌డిఒలు సన్నద్ధం కవాలన్నారు. పడవల ద్వారా నడపడానికి ఫోర్ షోర్ ప్రాంతం దాటి డీ సిల్టేషన్ కోసం అవకాశం ఉన్న రీచ్‌లను చైనేజ్‌ను అనుసరించి ర్యాంపు పాయింట్లను గోదావరీ హెడ్ వర్క్స్ డివిజన్ ఇఇ గుర్తించిన వాటిపై తగిన అనుమతులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్తగా గుర్తించిన కడియం మండలం వేమగిరి-ఎ, పెరవలి మండలం తీపర్రు ఎ, బిలు, నిడదవోలు మండలం జీడిగుంట ఎ,బిలు, పందలపర్రులో కొత్తగా గుర్తించిన సెమీ మెకనైజ్డ్ రీచేస్ మైనింగ్ ప్లాన్‌కు అనుమతికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. ఇరిగేషన్ అధికారులు ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు.

ఏజెన్సీల నుంచి పరిపాలన పరమైన ఖర్చులను వసూలు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఇసుక రవాణా చేస్తూ నిబంధనలను ఉల్లంఘించిన 77 వాహనాలను సీజ్ చేసి, నాలుగు కేసులు నమోదు చేశామన్నారు. 480 మెట్రిక్ టన్నుల ఇసుకను సీజ్ చేశామన్నారు. రూ.24.71 లక్షల అపరాధ రుసుం విధించామని తెలిపారు. యంత్ర పరికరాల వాడకం, అధిక మొత్తంలో వసూలు నేపథ్యంలో మూడు రీచ్‌లకు చెందిన కాంట్రాక్టు ఉత్తర్వులు రద్దు చేశామని తెలిపారు. అర్హత కలిగిన బోట్స్ మ్యాన్ సొసైటీల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హత కలిగిన వారికి అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా సిటిఇ, సిఇఒలను జారీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జెసి ఎస్.చిన్నరాముడు, ఆర్‌డిఒలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత , జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, ఇరిగేషన్ ఇఇ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బివి.గిరి, ఇన్‌ఛార్జి డిపిఒ ఎం.నాగలత, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ఇరిగేషన్ డిఇ బాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పలుచోట్ల పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో సోమవారం నుంచి పలుచోట్ల పశువైద్య శిబిరాలను ప్రారంభించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధులు సోకకుండా టీకాలు వేశారు. నట్టల నివారణా మందును ఉచితంగా పంపిణీ చేశారు.

చాగల్లు : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని నేలటూరులో సోమవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించామని పశు వైద్యులు డాక్టర్ యు.ముకేష్ తెలిపారు సోమవారం 35 పశువులకు, 40 దూడలకు, 105 కోళ్లకు నట్టల నివారణ మందులు వేశామని తెలిపారు. లంపి స్కిన్ సోకకుండా పది పశువులకు, గొంతువాపు వ్యాధి రాకుండా 220 పశువులకు, కొక్కెర వ్యాధి 300 కోళ్లకు టీకాలు వేశామన్నారు. ఆరు పశువులకు బాహ్య పరాన్న జీవుల నిర్మూలన, గర్భకోశ వ్యాధుల చికిత్స, మరో ఆరు పశువులకు చూడు పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ యడ్లపల్లి ఉమారజిని, తాళ్లూరి హరిచంద్రప్రసాద్ ప్రారంభించారు ఈ కార్యక్రమంలో తాళ్లూరి శ్రీనివాసరావు, తాళ్లూరి కేశవరావు, వార్డు సభ్యులు తాళ్లూరి వరప్రసాద్, నందిగం వీర వెంకట సత్యనారాయణ, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండల పశు వైద్యులు డాక్టర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో లంకూరు ఆర్‌ఎస్‌కెలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 72 పశువులకు, 262 జీవాలకు వైద్యసాయం అందించారు. 48 మంది పాడి రైతులు లబ్ధి పొందారు. శాస్త్రీయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీతానగరం సర్పంచ్ కొండ్రపు ముత్యాలు, జనసేన మండల నాయకులు మట్ట వెంకటేశ్వరరావు, కస్తూరిబా ఆశ్రమం నిర్వాహకులు జి.సుశీల, విఎ మునీంద్రా, ఎహెచ్‌ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

కడియం : మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధి వెంకాయమ్మపేటలో జేగురుపాడు పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్ రవి కిరణ్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. 90 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు పంపిణి చేశారు.

అర్జీలను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని ఆర్‌డిఒ కృష్ణనాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో డివిజన్ స్థాయి అధికారులతో కలిసి ఆయన పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులుపాల్గొన్నారు.

తాళ్లపూడి : ప్రజల నుంచి వస్తున్న అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. తాళ్లపూడి ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌లో ఆయన పాల్గొన్నారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. 33 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణ, ఇఒపిఆర్‌డి వీరన్న, డిప్యూటీ తహశీల్దార్ భారతి, టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, కూటమి నాయకులు ఇందుగల రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పెరవలి : తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ డి.అచ్యుతకుమారి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన పిజిఆర్‌ఎస్‌కు రెండు అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ, ఎలక్ట్రికల్ ఎఇ డేవిడ్‌నిశ్చల్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ జోగారావు, ఎపిఎం రామకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ రాజేష్ మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు

సీతానగరం : సోమవారం సీతానగరంలో నిర్వహించిన పిజిఆర్‌ఎస్‌కు నాలుగు అర్జీలు అందాయి. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ భారతి, తహశీల్దార్ శ్రీనివాస్ అర్జీలను స్వీకరించారు.



బహుమతులను అందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - నిడదవోలు

మండలం గోపవరంలో సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, నాయకులు ఆరేపల్లి చిన్ననంగలు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో విజేతలకు సోమవారం నగదు బహుమతులు అందించారు. మంత్రి కందుల దుర్గేష్, మాజీ ఎంఎల్‌ఎ బూరుగుపల్లి శేషారావు చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. అలాగే గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సూర్యారావు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన జమిందార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఏషియన్ నిడదవోలు మండల ప్రధాన కార్యదర్శి పంచదార దుర్గాప్రసాద్, నిడదవోలు మండల క్లస్టర్-2 ఇన్‌ఛార్జి జె.గోపి, ఐ.టిడిపి నిడదవోలు అధ్యక్షుడు ఆరేపల్లి దుర్గాశ్రీను, తెలుగుయువత మండల అధ్యక్షులు కోయి రమేష్, నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.



డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి - కడియం

గతేడాది అరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో విధులు నిర్వహించిన ఉద్యోగులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామ్మూర్తిని యుటిఎఫ్ నాయకులు కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒను కలిశారు. ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని, అలాగే కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామం ఆర్‌పిఎస్-2022 ప్రకారం 16శాతం హెచ్‌ఆర్‌ఎ వచ్చేలా చూడాలన్నారు. దీనికి డిఆర్‌ఒ సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.రమేష్, ఎం.శ్రీనివాస్, చిలుకూరి శ్రీనివాసరావు, కె.ప్రకాష్‌రావు ఉన్నారు.

సావిత్రీబాయి పూలే అవార్డు అందుకున్న లక్ష్మీదేవి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక చున్నీలాల్ జాజూ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న బివిఎస్‌యుబిఎ.లక్ష్మీదేవి సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డును అందుకున్నారు. సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, హెచ్‌ఎం సీతామహలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

అబ్దుల్ గఫర్‌ఖాన్‌కు నివాళి

తాళ్లపూడి: దేశ విభజనను వ్యతిరేకిస్తూ సరిహద్దుల్లో పోరాటం చేయడంతో సరిహద్దు గాంధీగా పేరొందిన ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్‌కు ఘనంగా నివాళులర్పించారు. రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్‌ఎం దున్నా దుర్గారావు ఆధ్వర్యంలో సరిహద్దు గాంధీ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. తొలుత గఫర్‌ఖాన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సరిహద్దు గాంధీ జీవిత విశేషాలను తెలిపారు.

నేరాలు ఘోరాలు

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వివాహిత అనుమానాస్పదంగా మతి చెందిన సంఘటన సోమవారం మూలపేట గ్రామంలో చోటు చేసుకుంది. కావాలనే తన కూతుర్ని చంపేశారని కొత్తపల్లి పోలీసులకు తల్లి గింజల లక్ష్మి ఫిర్యాదు చేసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. మూలపేట గ్రామం ప్రకాష్ నగర్‌కు చెందిన గింజల బాల (25) అదే గ్రామానికి చెందిన రాచపల్లి ప్రసాద్ 8 ఏళ్ల క్రితం ప్రేమించి ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే ఇటీవల కాలంలో భర్త రాచపల్లి ప్రసాద్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోవడంతో వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరిగుతున్నాయి. కావాలనే తన కూతురిని అత్తంటివారు సోమవారం ఉరివేసి చంపేసి వెంటనే ఆమె మృతదేహానికి ఖననం చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. అయితే ఈ విషయాన్ని తారుమారు చేసేందుకు పలు ప్రయోగాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చిందని మృతురాల తల్లి ఆవేదన వ్యక్తం చేసింది.

1600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేటలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జున్‌రావు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని తోటపేటలో నగల కోసం మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేశామని ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్ విలేకరులకు తెలిపారు. తోటపేటకు చెందిన దామిశెట్టి మహాలక్ష్మి ఒంటరిగా నివసిస్తోంది. పక్కనే గల నాగిరెడ్డి అప్పారావు నగల కోసం ఈ నెల 12న ఆమెను గొంతు నిలిపి హత్య చేశాడు. మృతురాలి అల్లుడు సురేష్ ఫిర్యాదుతో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుని అరెస్టు చేశారు. అతడి వద్ద మహిళ బంగారు గొలుసు, ఉంగరం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అప్పారావును రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మపేట వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మతి చెందాడు. వెలంపాలెంకు చెందిన కోనపల్లి జ్యోతి బాబు (38) తన స్కూటర్‌పై ద్రాక్షారామం నుంచి యానాం వైపు వెళుతుండగా వేగాయమ్మపేట మలుపు వద్ద స్కూటర్ అదుపుతప్పి పక్కనే ఉన్న పంట బోదెలోనికి బోల్తా కొట్టింది. దీంతో జ్యోతి బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. జ్యోతిబాబుకు భార్య ఉంది. బంధువుల ఫిర్యాదు మేరకు ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-రావులపాలెం

మండల పరిధిలోని రావులపాడు జాతీయ రహదారి సమీపంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం రావులపాడు వంతెన సమీపంలోని తుప్పల్లో సుమారు 35 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతదేహం ఉన్నట్టు విఆర్ఒ ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు ఎరుపురంగు షర్టు, లేత గోధుమ రంగు కాటన్ ప్యాంటు ధరించి లారీ క్లీనర్, డ్రైవర్ అయి ఉండవచ్చన్నారు.

పంట కాలువలో మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

బొబ్బర్లంక-పల్లంకుర్రు ప్రధాన పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ అవినాష్ తెలిపారు. మృతదేహంపై ప్యాంటు మాత్రమే ఉందని, మృతుడి వయసు 35 ఏళు ఉంటుందని ఆయన తెలిపారు. ఎవరైనా అనుమానితులు ఉంటే కాట్రేనికోన పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్క్మి తెలిపారు.

చోరీపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని కొత్తూరు సెంటర్ చైతన్య సప్లయర్స్‌లో బ్యాంక్ ఆఫ్ బరోడా కియోస్క్ ఉంది. శుక్రవారం రాత్రి చైతన్య సప్లయర్స్ తాళాలు పగలగొట్టి లోపల ఉన్న సొరుగుతో ఉన్న బల్లను అపహరించారు. ఈ బల్ల సొరుగులో వినియోగదారుల పత్రాలు ఉన్నాయని సప్లయర్స్ అధినేత తెలిపారు. ఈ అంశంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు


ఎగసి పడుతున్న మంటలు

ఎడిబి రోడ్డులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఏడిబి రోడ్డు వాలు తిమ్మాపురం రహదారిని ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఉన్న ప్లాస్టిక్, ధర్మకోల్‌కు సంబంధించిన సామాగ్రి అగ్ని ప్రమాదానికి గురైంది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో మంటలు ఎగిసి పడటంతో రహదారిలో వెళ్లేవారు భయాందోళనకు గురయ్యారు. ఈ మంటలను ఆర్పేందుకు పెద్దాపురం, జగ్గంపేటలకు చెందిన మూడు అగ్నిమాపక వాహనాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. రాత్రి 9 గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదు. పెద్దాపురం ఎస్ఐ వి మౌనిక సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు అగ్ని ప్రమాదానికి కారణమైన ఈ సామగ్రికి సంబంధించి ఎవరూ రాలేదన్నారు ఈ స్థలం యజమానిని పిలిపించి విచారణ జరుపుతామన్నారు.

మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం : ఎంఎల్ఎ గోరంట్ల

ప్రజాశకి- కడియం

మురమండ గ్రామం ఎఎంజి నగర్‌లో దీర్ఘకాలంగా ఉన్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఈ ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో మురమండ గ్రామాన్ని దత్తత తీసుకుని పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అనంతరం వచ్చిన వైసిపి ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో కూడా చొరవ చూపించలేక పోయిందన్నారు. ఎఎంజీ నగర్‌లో మురుగునీరు తాత్కాలికంగా బయటికి పోయే విధంగా 24 గంటల్లో చర్యలు తీసుకుంటానని తెలిపారు. నూతనంగా డ్రెయినేజీని నిర్మిస్తామన్నారు. ఏప్రిల్ నాటికి శాశ్వత పరిష్కారాన్ని చూపిస్తానని తెలిపారు. దానికి అనుగుణంగా అధికారులు అంచనాలు వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, నాయకుల ముమ్మిడిదేవి నాగేశ్వరరావు వెలుగుబంటి నాని, ప్రత్తిపాటి రామారావు చౌదరి, వట్టికూటి దత్తుడు, దేవళ్ళ రాంబాబు, పాతంశెట్టి రాంజీ, పంచాయతీ రాజ్ డిఇఇ రవి, ఎంపిడిఒ రమేష్, తహశీల్దార్ పోసియ్య, షేక్ మీరా, పిల్లా వెంకట్రావు, సిహెచ్.చౌదరి, మిద్దె గోపి తదితరులున్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

బాలికను కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం వేకివాడ గ్రామానికి చెందిన పండలనేని దుర్గాప్రసాద్ అనే వ్యక్తి రఘుదేవపురం గ్రామంలో ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసాడు. ఈ మేరకు పోలీసులు గాలింపు చేపట్టారు. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో కారులో బాలికతో పాటు నిందితుణ్ని పోలీసులు పట్టుకున్నారు. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేశారు. అనంతరం రాజమహేంద్రవరం కోర్టులో హాజరు పరిచారు. నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించారని సీతానగరం ఎస్ఐ తెలిపారు.

కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నిడదవోలు

కెవిపిఎస్ ముద్రించిన డైరీని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఆవిష్కరించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆత్మ గౌరవం సమానత్వం కుల నిర్మూలన కోసం కెవిపిఎస్ చేసే కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ఐద్వా జిల్లా కార్యదర్శి తులసి, సిఐటియు నాయకులు దయామణి, మద్దిపాటి ఫణీంద్ర, గోపీ యాదవ్, ప్రభాకర్, సురేష్, రాజేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


కెవిపిఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్


పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా

దుర్గారావుకు జక్కంపూడి పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లపూడి

మాతృవియోగంతో బాధపడుతున్న ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్నా దుర్గారావు కుటుంబాన్ని వైసిపి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా సోమవారం పరామర్శించారు. దుర్గారావు తల్లి వీరాయమ్మ ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. మండలంలోని పైడిమెట్ట గ్రామంలో దుర్గారావు ఇంటికి వెళ్లి రాజా పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట వైసిపి నాయకులు తోట రామకృష్ణ, నామా ప్రకాశం, పెద్దేవం సర్పంచ్ టి.వెంకట్రావు, వనిమిరెడ్డి శ్రీను, ఎన్.వేణు, ఉపాధ్యాయులు టి.ఆదిశేషు తదితరులున్నారు.

పోటీల్లో విద్యార్థులకు 25 బంగారు పతకాలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

చిత్రకళా పోటీలలో అమలాపురం మండలం పాలగుమ్మి ఉన్నత పాఠశాల విద్యార్థులు 25 బంగారు పతకాలు సాధించారని పాఠశాల హెచ్ఎం గుంట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. కోనసీమ చిత్రకళా పరిషత్ ఇటీవల నిర్వహించిన 35వ అంతర్జాతీయ బాలల చిత్రలేఖనం వండర్ ఆర్ట్ వరల్డ్ పోటీలలో తమ విద్యార్థులు చిత్రలేఖనంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్‌కు విశిష్ట ఆచార్య పురస్కార్ అవార్డు అందజేశారు. కోనసీమ చిత్రకళా పరిషత్ 35 బ్రహ్మోత్సవం సందర్భంగా జాతీయస్థాయిలో ఉత్తమ చిత్రకారులు అందర్నీ ఒకచోట సమీకరించి ముద్రించిన పుస్తకంలో నరసింహ చంద్రకుమార్‌కు చోటు దక్కటంతో వారు అభినందించారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

ఘనంగా సత్యనారాయణ పుట్టినరోజు

ప్రజాశక్తి - నిడదవోలు

స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నిడదవోలు పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ పుట్టిన రోజును సోమవారం ఘనంగా నిర్వహించారు. టిడిపి నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, విశాలాక్షి దంపతులు తిరుపతి సత్యనారాయణ, లక్ష్మి దంపతులను ఆశీర్వదించారు. మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్ని శుభాకాంక్షలు తెలిపారు. సత్యనారాయణ దాంపత్య జీవితం 50 ఏళ్ల పూర్తి చేసుకున్న తరుణంలో వారికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు పట్టణ టిడిపి అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు, టిడిపి మండలం అధ్యక్షులు వెలగన సూర్యారావు, టిడిపి ఉండ్రాజవరం మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, పెరవలి మండల అధ్యక్షులు అతిగాల శ్రీను, నిడదవోలు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు నల్లూరి పుష్పవతి, నిడదవోలు పట్టణ మహిళా అధ్యక్షురాలు కొండ నిర్మల. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ రాజు

వివాదాస్పద స్థలం పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చెముడులంక శ్రీనివాసనగర్‌లో వివాద స్థలంపై స్థానికుల ఫిర్యాదు మేరకు ఎంపిడిఒ ఇన్‌ఛార్జి డిఎల్‌పిఒ ఎ.రాజు సోమవారం పరిశీలించారు. పరిశీలన అనంతరం ఉభయపక్షాలతో చర్చలు జరిపారు. మంగళవారం కార్యాలయం వద్దకు ఇరువర్గాల వారిని హాజరవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు సిహెచ్.సుభాష్, గణేష్, డిజిటల్ అసిస్టెంట్ పట్టాభి, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి రాంబాబు, లంకలపల్లి ఆంజనేయులు, అడబాల వీర్రాజు, స్థానికులు పాల్గొన్నారు.

రామచంద్రపురం డిఎస్‌పిగా రఘువీర్

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం డిఎస్‌పిగా బిట్ర రఘువీర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు రేంజ్ డిఐజి కార్యాలయం నుంచి ఆయన శిక్షణ పూర్తి చేసుకుని ఇక్కడ నేరుగా డిఎస్‌పిగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన డిఎస్‌పి డి.రామకృష్ణ రాజమండ్రి ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ కాగా అమలాపురం డిఎస్‌పి డిఎస్‌ఆర్.ప్రసాద్ ఇన్‌ఛార్జి డిఎస్‌పిగా బాధ్యతలు నిర్వర్తించారు. రఘువీర్ నియామకంతో ఇక్కడ ఖాళీ భర్తీ అయ్యింది.

ఓటు విలువపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-అయినవిల్లి

జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండలంలో 9, 10 తరగతుల విద్యార్థులకు 'ప్రజాస్వామ్యంలో ఓటు విలువ' అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఎంఇఒ పెచ్చెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలకు చెందిన పదం మంజు శ్రీ ప్రథమ స్థానం, కొండుకుదురు ఉన్నత పాఠశాలకు చెందిన వైఎన్ఎల్.తేజస్విని ద్వితీయ స్థానం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికిగైడు టీచర్లుగా జి.సాయి శ్రీనివాస్, డి.రామారావు వ్యవహరించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-కాట్రేనికోన

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడతాయని సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షుడు గంటి వెంకట సుధాకర్ పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా పది రోజులపాటు కాట్రేనికోన జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో బాబా యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకమ్మ చెరువు, రామస్వామి తోట, బాబా ఎలెవెన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో బాబా ఎలెవెన్ జట్టు విజేతగా నిలవడంతో వారికి రూ.పది వేల నగదుతో పాటు ట్రోఫీని బహూకరించారు. రన్నర్‌గా నిలిచిన వెంకమ్మ చెరువు జట్టుకు రూ.5000 నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలెపు లక్ష్మీ ధర్మారావు, నల్లా నరసింహమూర్తి, సంసాని నాగేశ్వరరావు, జగడం బాలయోగి పాల్గొన్నారు.

30 వరకూ ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి -మామిడికుదురు

మామిడికుదురు మండల పరిధిలో ఈ నెల 21 నుంచి 30 వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 21న పెదపట్నంలంక-1, 22న బి.దొడ్డవరం, 23న పాశర్లపూడి-1, 24న పాశర్లపూడిలంక, 27న లూటుకుర్రు, 28న ఆదుర్రు, 29న మగటపల్లి, 30న గోగన్నమఠం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేశామని వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

పినపళ్లలో ఉమెన్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో రోగులకు సోమవారం ట్రస్ట్ చైర్మన్, ఆలమూరు సివిల్ కోర్ట్ ఎజిపి బూసి విద్యా ప్రసన్న ఆధ్వర్యంలో కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మొత్తం 52 మంది రోగులకు ఈ కళ్లజోళ్లను అందించారు. ట్రస్టు సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత సుభాష్, కూటమి నాయకులు వక్కపట్ల లక్ష్మణరావు, వంటిపల్లి సతీష్, వెర్రియ్య, ఎస్‌కె.అన్సారీ, కత్తుల పండు, పి.వెంకటేశ్వర్లు, జె.రామారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-గోకవరం



మండలంలోని తిరుమలాయపాలెంలో సర్పంచ్ పురంశెట్టి శివాజీ, ఎంపిటిసి సభ్యులు చెన్నంశెట్టి చక్రరావు ఆధ్వర్యంలో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని ఎంఎల్ఎ జ్యోతులనెహ్రూ మనువడు జ్యోతుల అనిష్‌నెహ్రూ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. సర్పంచ్ శివాజీ మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా తిరుమలయపాలెం గ్రామ దేవత కడేలమ్మ జాతరను ఘనంగా నిర్వహించామన్నారు. ఇందులో భాగంగా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించామన్నారు

సర్వేలో జాప్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం


చెరువులు, ఇతర నీటి వనరులున్న ప్రాంతాల సర్వేలో జాప్యంపై న్యాయవాది చిడిపి నకుల సురేష్ పిజిఆర్‌ఎస్‌లో సర్వేయర్ గౌతమ్‌పై సోమవారం ఫిర్యాదు చేశారు. సురేష్ మాట్లాడుతూ మండలంలో నీటి వనరులు, చెరువుల ఆక్రమణలు నిరంతర సమస్యగా ఉన్నాయన్నారు. ఆక్రమణలపై పలుమార్లు ఫిర్యాదు చేశామన్నారు. ఆక్రమణలను పరిష్కరించాలని ఆర్‌డిఒ సీతానగరం తహశీల్దార్‌ను ఆదేశించారన్నారు. సర్వే చేసి ఆక్రమణలపై నివేదిక ఇవ్వాలని సర్వేయర్ శ్రీ గౌతమ్‌కు బాధ్యతను తహశీల్దార్ అప్పగించారని తెలిపారు. కాని నేటికీ ఎలాంటి సర్వే చేయలేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి -దేవరపల్లి

చిన్నాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో2002-03 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఉత్సాహంగా సాగింది. అప్పటి హెచ్ఎం ఎస్.కిరణ్‌బాబు, ఇతర ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో సందడిగా గడిపారు.




చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ

సిఎం సహాయనిధి చెక్కుల అందజేత


ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి గ్రామానికి చెందిన రెండు కుటుంబాలకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను కొవ్వూరి ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన పడాల నాగ సతీష్‌కు రూ.49,937, చట్టాల నాగసత్యనారాయణకు రూ.85,561 విలువ చేసే చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, కూటమి నాయకులు ఇండుగల రామకృష్ణ, ఉడతా వీరేంద్ర, నామ చినసత్యనారాయణ, రమేష్, ఎ.సురేష్, ఎంపిడిఒ రమణ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని రఘుదేవపురం గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు నిద్రిస్తుండగా వారి కుమార్తె తండ్రి ఫోన్ తీసుకొని ఇంటి నుండచి వెళ్లిపోయింది. కుమార్తె ఆచూకీ కోసం తల్లిదండ్రులతో పాటూ, కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించారు. బంధువుల ఇంటి వద్ద, స్థానికంగా ఆరా తీశారు. అయినా యువతి ఆచూకీ తెలియలేదు. దీంతో యువతి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. యువతి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గాలింపు చేపట్టామని ఆయన తెలిపారు.


శ్రీనివాసరావును సత్కరిస్తున్న వైసిపి శ్రేణులు

శ్రీనివాసరావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - అంబాజీపేట

వైసిపి పి.గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన గన్నవరపు శ్రీనివాసరావును వైసిపి మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి బూడిద వరలక్ష్మి, ఎంపిటిసిల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, పేరి శ్రీను, కొర్లపాటి కోటబాబు, మైలె ఆనందరావు, ఉందుర్తి నాగబాబు, దొమ్మేటి సత్యమోహన్, సుదాబత్తుల రాము, శీలం మోహనరావు, ఎంఎం.శెట్టి, మట్టపర్తి నాగరాజు, దంగేటి అబ్బులు, దంగేటి సూర్యనారాయణ, కుడుపూడి సత్తిబాబు, మట్టపర్తి హరి, వాకపల్లి శ్రీను, మట్టా వెంకటేశ్వరావు, పితాని వీరాస్వామి, మద్దింశెట్టి మల్లిబాబు, కాండ్రేగుల గోపి, జె.ఏడుకొండలు, నాగాబత్తుల రాజేష్, కాండ్రేగుల దుర్గ, గుబ్బల సురేష్ , సరెళ్ల వెంకట్రావు, సిద్దాబత్తుల శ్రీను, గోసంగి స్వామి పాల్గొన్నారు.

భీమేశ్వరుని కల్యాణోత్సవాలపై సమీక్ష

ప్రజాశక్తి-రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి కళ్యాణోత్సవాలపై మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 8 నుంచి 14 వరకూ జరిగే కళ్యాణ మహోత్సవాలపై అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ పారాయణలు నిర్వహించారు. నలుగురు దేవస్థాన సభ్యులతో వైదిక కమిటీ ఏర్పాటు చేశారు. కళ్యాణోత్సవాలు వైభవంగా జరపాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ కుమారి, పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అమలాపురం రూరల్ : ఖాళీగా ఉన్న భూములు కబ్జాకు గురవుతున్నాయని, మిగులు భూములను స్వాధీనం చేసుకోవాలని నడిపూడి అంబేద్కర్ కాలనీ వాసులు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో గృహాలు నిర్మించుకోగా మిగిలిన భూములు నేటికీ నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని కొందరు కబ్జా చేసి నకిలీ పట్టాలు సృష్టించి ఎవరికి నచ్చిన రీతిలో వారు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. మిగిలిన భూములపై సమగ్ర భూ సర్వే చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, నిజమైన పేద లబ్ధిదారులకు స్థలాలు మంజూరు చేయాలని కోరారు.